క్లుప్తంగా

బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి



సత్తెనపల్లి: బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని ప్యానల్ న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు అన్నారు.పట్టణ పరిధిలోని 22, 17 వార్డుల్లో శుక్రవారం నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యకి సంబంధించి అనేక పథకాలు అందిస్తున్నాయని, వాటిని తల్లిదండ్రులు వినియోగించుకుంటూ పిల్లలను బడికి పంపాలని సూచించారు.

ఓటర్ల జాబితాపై ఇంటింటి విచారణ



సత్తెనపల్లి: ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ -2024లో భాగంగా బూత్ లెవల్ అధికారులు (బీఎల్వోలు) శుక్రవారం కంటెపూడిలో శుక్రవారం ఇంటింటా విచారణ చేపట్టారు. తహసీల్దార్ ఎస్.సురేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ జాబితాలో తప్పుఒప్పులను పరిశీలన చేసి సక్రమంగా తయారు చేస్తామని తెలిపారు.

'వెలుగూరి' సేవలు స్ఫూర్తిదాయకం



సత్తెనపల్లి: రాజకీయ, సేవా రంగాల్లో వెలుగూరి వెంకటేశ్వర్లు సేవలు స్ఫూర్తిదాయకమని వక్తలు కొనియాడారు.ఆర్యవైశ్య సేవా సమితి అధ్యక్షుడు వెలుగూరి శరత్‌బాబు ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రధాన రహదారిలో గల వెంకటేశ్వర్లు విగ్రహం వద్ద శుక్రవారం ఆయన 51వ వర్ధంతి సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. 15 మందికి కుట్టు మిషన్లు, వెట్ గ్రైండర్లు, ఇద్దరికి తోపుడు బండ్లు, ఇద్దరికి ట్రై సైకిళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ మృతి

రొంపిచర్ల : వేగంగా వస్తున్న ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడి డ్రైవర్ మృతి చెందిన సంఘటన మండలంలోని మునమాక గ్రామంలో శుక్రవారం జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం ... గ్రామానికి చెందిన షేక్ కరీంసా (38) ట్రాక్టర్ డ్రైవర్ గా పనిచేస్తున్నారు. ఆ గ్రామానికి చెందిన రైతుల పొలాలను ట్రాక్టర్ తో దున్ని ఇంటికి వస్తున్నారు. ఈ క్రమంలో గ్రామంలో గల కొండకావూరు కాలువ మేజర్ వద్దకు రాగానే అదుపుతప్పి కాలువలో దూసుకుపోయి బోల్తా పడింది. ట్రాక్టర్ నడుపుతున్న డ్రైవర్ కరీంసా (38) మీద ట్రాక్టర్ పడటంతో ఊపిరాడక అక్కడిక్కడికే మృతి చెందారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు అధిక సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. కాగా మృతుడికి భార్య, ఒక్క కుమారుడు, ఒక్క కుమార్తె ఉన్నారు. మృతదేహం వద్ద కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

చెట్టు కొమ్మలు నరుకుతూ..

యడ్లపాడు: మండలంలోని కొత్తపాలెం (పుట్టకోట) గ్రామంలోని ఓ మామిడి తోటలో చెట్టుకొమ్మల్ని కొడుతున్న కూలీకి ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి తీవ్రగాయాలైన సంఘటన శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..కొత్తపాలెం గ్రామానికి చెందిన 8 మంది కూలీలు మామిడితోటల్లో చెట్ల కొమ్మల్ని తొలగించడానికి వెళ్లారు. ఈ నేపథ్యంలో బోయిన రాము కూలీలతో కలిసి కొమ్మలు నరికేందుకు మామిడి చెట్టు ఎక్కాడు. చెట్టు కొమ్మను కొట్టగా అది 11 కేవీ తీగలపై పడింది. దానిని తొలగించేందుకు రాము ప్రయత్నించడంతో తీగల్లో విద్యుత్ సరఫరా ఉండటంతో షాక్‌కు గురయ్యాడు. గమనించి తోటి కూలీలు కర్రలతో కొట్టి షాక్ నుంచి విడిపించారు. వెంటనే ఫిరంగిపురం మండలంలోని ఓ ప్రైవేట్ క్లినిక్‌కు తరలించారు. ప్రస్తుతం ప్రాణాపాయం లేదని, నెలరోజుల పాటు విశ్రాంతి అవసరం ఉంటుందని వైద్యులు చెప్పినట్లు వెల్లడించారు.

మలేరియా రహిత సమాజం కోసం కృషి

రెంటచింతల: మలేరియా రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డి సూచించారు. మలేరియా నివారణ మాసోత్సవం సందర్భంగా శుక్రవారం పీహెచ్‌సీలో ఆరోగ్య, మలేరియా సిబ్బంది, ఆశా కార్యకర్తలకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దోమకాటు ద్వారా మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా, బోదకాలు వంటి వ్యాధుల వ్యాపించే అవకాశం ఉందని ప్రజలకు వివరించాలని తెలిపారు. ప్రతి శుక్రవారం డ్రై డేను తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

నేటి నుంచి 'జగనన్న సురక్ష' శిబిరాలు

75 సచివాలయాలు..
21 రోజుల క్యాంపులు

- పూర్తయిన వలంటీర్ల ఇంటింటా సర్వే
- లబ్ధిదారులందరికీ పథకాలు అందించడమే లక్ష్యం



దమ్మాలపాడులో జగనన్న సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో పుట్టారెడ్డి, డెప్యూటీ తహసీల్దార్ లక్ష్మీప్రసాద్

సత్తెనపల్లి: జగనన్న సురక్ష కార్యక్రమం శనివారం నుంచి నియోజకవర్గంలో ప్రారంభం కానుంది. ఇప్పటికే 75 సచివాలయాల పరిధిలో 1,488 మంది వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి జల్లెడ పట్టారు. కుటుంబానికి ఏం కావాలన్న అంశాన్ని జగనన్న సురక్షలో అప్లోడ్ చేశారు. సర్వీస్ రిక్వెస్టుల్ని రిజిస్టర్ చేసి టోకెన్ నంబర్ ఇచ్చారు. జులై ఒకటి నుంచి ఆ సచివాలయాల పరిధిలో నిర్వహించే సురక్ష క్యాంపుల్లో వారికి అవసరమైన ధ్రువపత్రాలు, ఇతర లబ్ధి చేకూర్చనున్నారు. ఇప్పటికే ఆయా మండలాల ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో మండల స్థాయిలోనూ, సచివాలయ స్థాయిలోనూ వలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి శిక్షణ అందించారు. క్యాంపుల నిర్వహణకు ఒక్కో గ్రామీణ మండలంలో రెండు టీంలు, అర్బన్ పరిధిలో రెండు టీంలు ఏర్పాటు చేశారు. అర్బన్ పరిధిలో ఐదు సచివాలయాల్ని క్లస్టర్‌గా ఏర్పాటు చేశారు. క్యాంపుల్లో రిజిస్ట్రేషన్ డెస్క్, వెరిఫికేషన్ డెస్క్, సర్వీస్ రిక్వెస్ట్ డెస్క్‌లు ఏర్పాటు చేయనున్నారు. వలంటీర్ల సర్వే సమయంలోనూ ఎవరైనా మిస్ అయితే .. క్యాంపు రోజున కూడా రిజిస్టర్ చేసుకోవచ్చు. అక్కడికక్కడే పరిశీలించి సమస్యను పరిష్కరిస్తారు.

రెండు గ్రామాల్లో జగనన్న సురక్ష క్యాంపులు

ముప్పాళ్ల : మండలంలోని దమ్మాలపాడు, ఇరుకుపాలెం గ్రామాల్లో జగనన్న సురక్ష క్యాంపులు శనివారం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఎం.భవానీ శంకర్ శుక్రవారం తెలిపారు. ఉదయం 10.30 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని ఆయన కోరారు.

క్రోసూరు: మండలంలోని ఊటుకూరు, అందుకూరు గ్రామాల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5గంటల జగనన్న సురక్షా క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో బి.మహేష్ తెలిపారు. గ్రామస్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో భాగస్వాములు కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ ఆంజనేయులు, ఎస్ఐలు

పిడుగురాళ్ల: ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో సామాన్యులు సైతం భాగస్వాములు కావాలని పట్టణ సీఐ పి.వి.ఆంజనేయులు కోరారు. ఎవరైనా రాంగ్ రూట్‌లో వస్తుంటే వెంటనే ఫొటో తీసి తమకు వాట్సప్ ద్వారా సమాచారం అందించాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఎవరైనా ట్రాఫిక్ రూల్స్‌ను అతిక్రమించినట్లు వెంటనే సందేశం పంపితే వారికి ఫైన్ వేస్తామని చెప్పారు. సమావేశంలో ఎస్ఐలు పవన్‌కుమార్, పఠాన్ రబ్బానీ ఖాన్ పాల్గొన్నారు.

ఉద్యోగులకు సన్మానం



ఉద్యోగులను సత్కరిస్తున్న వైద్య సిబ్బంది

పెదకూరపాడు: ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగుల్ని ప్రజలు ఎన్నటికీ మరువరని సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ రవివర్మ తెలిపారు. పెదకూరపాడు సామాజిక ఆరోగ్య కేంద్రంలో 13 సంవత్సరాలుగా స్టాఫ్ నర్సులుగా సేవలు అందిస్తూ బదిలీపై సత్తెనపల్లి వెళ్లిన సంజయ్‌కుమార్, ఆంజలి, లక్ష్మి, విజయకుమారి, శ్యామలను శుక్రవారం సత్కరించారు. వారి సేవల్ని సిబ్బంది కొనియాడారు. కార్యక్రమంలో వైద్యులు అనిల్‌కుమార్, ధీరజ్‌కుమార్, చైతన్య, రమేష్, మాధవీలత, సాయి శ్రీనివాసరావు, జన్‌కిషి, రూప, లక్ష్మి, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

దుర్గి రైతాంగానికి రూ. 9 కోట్ల పంట బీమా లబ్ధి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ఏచూరి సాయిశంకర్, ఏఓ అమీర్‌రెడ్డి

దుర్గి: రైతాంగ అభివృద్ధికి రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ ఉచిత పంట బీమా పథకాన్ని అమలు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దక్కిందని ఎంపీపీ ఏచూరి సాయిశంకర్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం వ్యవసాయ అధికారి వై. అమీర్‌రెడ్డితో కలసి ఆయన మాట్లాడారు. దుర్గి రైతాంగానికి రూ. 9 కోట్ల పంట బీమా లబ్ధి చేకూరినట్లు వివరించారు. ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి చొరవతో మండలంలో గత ఖరీఫ్ సీజన్‌లో నష్టపోయిన పత్తి, కంది పంట రైతులకు మేలు కలిగే విధంగా చర్యలు చేపట్టారని చెప్పారు. ఏ సంవత్సరంలో నష్టపోయిన రైతాంగానికి అదే సంవత్సరంలో పరిహారం అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కిందని తెలిపారు. జులై 8న వైఎస్సార్ జయంతి సందర్భంగా రైతు దినోత్సవం నాడు పీఆర్కే చేతుల మీదుగా కార్యక్రమాన్ని ప్రారంభించి, రైతాంగ ఖాతాల్లోకి నేరుగా నగదు జమ చేయనున్నట్లు సాయిశంకర్ తెలిపారు. కార్యక్రమంలో మండల పరిషత్తు ఏవో శివప్రసాద్, సీనియర్ అసిస్టెంటు సరికొండ రాజు పాల్గొన్నారు.

యాప్‌లో వివరాలు నమోదు చేయాలి

అచ్చంపేట: ఈ– ఆశా యాప్‌లో గర్భిణులు, బాలింతల వివరాల్ని నమోదు చేయాలని వైద్యాధికారి రాజేష్ తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఆయన ఆశా వర్కర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. గర్భం దాల్చిన నాటి నుంచి ప్రతి నెలా వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేయడంతో పాటు, మందుల్ని సక్రమంగా అందజేయాలని సూచించారు. టీటీ ఇంజక్షన్లు, ఐరన్ టాబ్లెట్స్ సకాలంలో ఇవ్వాలని చెప్పారు. వైద్యశాలలోనే ప్రసవించే విధంగా గర్భిణులకు అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విత్తనశుద్ధితో అధిక దిగుబడులు

రెంటచింతల: ఖరీఫ్‌లో రైతులు విత్తన శుద్ధి చేయడం వల్ల అధిక దిగుబడులు సాధించడంతో పాటు పలు ప్రయోజనాల్ని పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి శుక్రవారం తెలిపారు. పది లీటర్ల నీటిలో 1.5 కిలోల ఉప్పు కలిపి ఎంపిక చేసుకున్న విత్తనాలను పోయగా, పైకి తేలిన వాటిని తీసి వేయాలని సూచించారు. నీటి అడుగున మునిగిన గట్టి విత్తనాలను నారు పోసుకోవడానికి వాడుకోవాలని తెలిపారు. కిలో వరి విత్తనానికి లీటరు నీటిలో 2.5 గ్రాముల కార్బండజిం కలిపి 24 గంటల నానబెట్టాలన్నారు. అనంతరం మరో 20 నుంచి 24గంటల పాటు మంచినీటిలో ఉంచి తరువాత నారుమడులలో చల్లుకోవాలని సూచించారు. విత్తనాల ద్వారా సంక్రమించే తెగుళ్ల నివారణ కోసం కిలో విత్తనానికి మూడు గ్రాముల థైరమ్ లేదా కాప్టాన్ మందును కలిపి శుద్ధి చేసుకోవాలని తెలిపారు. ఆకు తినే పురుగులు, ఉల్లికోడు, మొవ్వ పురుగు సోకకుండా మొలకెత్తిన విత్తనాన్ని నారు మడిలో చల్లేముందు 0.2 శాతం క్లోరిప్రీరిఫాస్ ద్రావణంలో నానపెట్టి చల్లు కోవాలన్నారు. కిలో పత్తి విత్తనాన్ని ఎనిమిది గ్రాముల ట్రైకోడెర్మావిరిడితో, కేజీ మిరప విత్తనాన్ని 8 నుంచి 10 ఎం.ఎల్. గౌచో ద్రావణంలో శుద్ధి చేయడం మంచిదన్నారు. పత్తి చుట్టూ అంతర పంటగా నాలుగు సాళ్లలో ఒక సాలుకు కంది, మినప, పెసర పంటల్ని సాగు చేసుకోవడం ఉత్తమని తెలిపారు. మాగాణి చుట్టూ గట్టుపై కంది పంటను అంతర పంటగా సాగు చేయడం వల్ల రైతులకు అదనపు ఆదాయం వస్తుందని సూచించారు. ప్రభుత్వం కూడా వ్యవసాయ శాఖ ద్వారా అంతర పంటలను సాగుచేసే రైతుల్ని ప్రోత్సహిస్తోందని వివరించారు.

పింఛన్ల పంపిణీకి నగదు మంజూరు

క్రోసూరు: సామాజిక పింఛన్ల పంపిణీ శనివారం మండలంలో 15 సచివాలయాల పరిధిలో చేపట్టనున్నట్లు ఎంపీడీవో బి.మహేష్ తెలిపారు. మండలంలో 8,489 మందికి గానూ రూ. 23,52,0750 మంజూరైనట్లు ఆయన పేర్కొన్నారు. ఆయా సచివాలయాల పరిధిలోని వలంటీర్లు ఉదయమే ఇళ్లకు వెళ్లి నగదు పంపిణీ చేస్తారని తెలిపారు.

పేద విద్యార్థికి ఆర్థిక సహాయం



ఆర్థిక సహాయం అందిస్తున్న క్లబ్ ప్రతినిధులు

నరసరావుపేట ఈస్ట్: వాసవీ క్లబ్ గ్రేటర్ రీజియన్ చైర్మన్ పల్లపోతు ప్రకాశరావు నరసరావుపేట పర్యటనలో భాగంగా శుక్రవారం పేద విద్యార్థికి రూ.22వేలు ఆర్థిక సహాయం అందించారు. సత్తెనపల్లిరోడ్డులోని వాసవీ మినీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వినుకొండ మండలం పాత గోకనకొండ గ్రామానికి చెందిన కొప్పురావూరి విజయభాస్కర్‌కు ఆర్థిక సహాయంతో పాటు స్కూల్ బ్యాగ్, దుస్తులు, దుప్పట్లును ప్రకాశరావు చేతుల మీదుగా అందించారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ పట్టణ అధ్యక్షుడు ఆత్మకూరి కోటేశ్వరరావు, కోశాధికారి మండవ శేషగిరిరావు, రీజియన్ సెక్రెటరీ తడవర్తి నాగరాజు, మునగాల చిరంజీవి, ఏవి సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

నూరు శాతం రాయితీపై కంది విత్తనాల పంపిణీ

నకరికల్లు: నూరు శాతం రాయితీపై కంది విత్తనాలను రైతుభరోసా కేంద్రాల్లో పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు తెలిపారు. నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ మిషన్ పథకం ద్వారా ఎల్ఆర్‌జీ–52 రకం కంది విత్తనాలను చేజర్లలోని రైతుభరోసా కేంద్రంలో శుక్రవారం ఆయన రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అట్లూరి వరలక్ష్మి, గ్రామ ఉద్యాన సహాయకుడు వి.వంశీ, రైతులు పాల్గొన్నారు.

కందిపాడులో ఆధార్ సెంటర్ ప్రారంభం

బెల్లంకొండ: మండలంలోని కందిపాడు సచివాలయంలో నూతన ఆధార్ నమోదు కేంద్రాన్ని ఎంపీపీ చెన్నపరెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. గ్రామస్తులంతా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరెడ్డి, గ్రామ సర్పంచ్ కంభంపాటి పాప, ఎంపీటీసీ సభ్యురాలు రేగులగడ్డ తిరుపతమ్మ పాల్గొన్నారు.

చంద్రబాబు చేతిలో కీలుబొమ్మ రామోజీరావు

దుర్గి: దుర్గి ప్రధాన రహదారిపై ఈనాడు పత్రికను దహనం చేసి వైఎస్సార్ సీపీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డు చైర్మన వెలిదండి గోపాల్ మాట్లాడుతూ చంద్రబాబు చేతిలో రామోజీరావు కీలుబొమ్మ అన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ప్రభుత్వ విప్ పీఆర్కేపై ఈనాడు పత్రిక విష ప్రచారాన్ని ప్రచురించి చంద్రబాబుకు లబ్ధి చేకూర్చాలని ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఇంతకాలం కనిపించని అరాచకాలు, అక్రమాలకు నేడు రామోజీరావుకు కనబడటం హాస్యాస్పదమని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

దుష్ప్రచారం హేయం

మాచర్ల: సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై ఈనాడు పేపర్ ద్వారా మాజీ సీఎం చంద్రబాబు, దుష్ప్రచారం చేయించడం హేయమైన చర్యని మున్సిపల్ మాజీ చైర్మన్ అబ్దుల్ జలీల్, మైనార్టీ నేతలు షేక్ సుభాని, షేక్ మస్తాన్, దస్తగిరి, షేక్ కరీముల్లా, ఉప్పలపాటి జాని ఖండించారు. వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం రాత్రి మాట్లాడారు. ఎక్కడో కారంపూడిలో జరిగిన ఓ చిన్న సంఘటనను బూతద్దంలో చూపుతూ నియోజకవర్గంలో అలజడి సృష్టించేందుకు టీటీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బ్రహ్మారెడ్డి రోడ్డుపై కూర్చొని విమర్శలు చేయడం అవివేకమని పేర్కొన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ తురక కిశోర్, డైరెక్టర్ కామనబోయిన కోటయ్య, పోలూరి నరసింహారావు, జెడ్పీటీసీ సభ్యుడు మల్లుస్వామి పాల్గొన్నారు.

ప్రజల సహకారంతోనే మలేరియా నివారణ

సత్తెనపల్లి: ప్రజల సహకారంతోనే మలేరియా నివారణ సాధ్యమని సత్తెనపల్లి పట్టణ సబ్ యూనిట్ అధికారి సీహెచ్. ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మలేరియా నివారణ ముగింపు ఉత్సవంలో భాగంగా సత్తెనపల్లి పట్టణ సబ్ యూనిట్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని వెంగళరెడ్డినగర్ 14వ సచివాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూడేళ్ల నుంచి మలేరియా కేసులు సత్తెనపల్లి పట్టణంలో నమోదు కావడం లేదన్నారు. జ్వరం వచ్చిన వెంటనే దగ్గరలోని ఆరోగ్య కేంద్రాల్లో పరీక్షలు చేయించుకోవాలని ప్రజలకు సూచించారు. అనంతరం మలేరియా నివారణ నినాదాలతో ర్యాలీ నిర్వహించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

బెల్లంకొండ: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మండల ఆయుర్వేద వైద్యుడు ఆర్.శ్రీనివాస్ సూచించారు. బెల్లంకొండ మెయిన్ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం కార్యకర్తలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. చిన్నతనం నుంచే పిల్లలు వ్యక్తిగత పరిశుభ్రత అలవరుచుకునేలా వారికి అవగాహన కల్పించాలని చెప్పారు. దోమకాటు ద్వారా మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, స్వైన్‌ఫ్లూ తదితర విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాల్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన సూచించారు. అనంతరం సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఆయుర్వేద మందుల్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, వివిధ గ్రామాల కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ సేవలు

రుద్రవరం(ముప్పాళ్ల): మండలంలోని రుద్రవరం, కుందురువారిపాలెం గ్రామాల్లో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ సేవల్ని నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యులు పి.రమాదేవి, జయకృష్ణ పాల్గొని 124 మందికి వైద్య సేవలందించారు. సాధారణ పరీక్షలతో పాటు బీపీ, షుగర్, రక్త పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందుల్ని అందించారు. అనారోగ్యంతో మంచానికే పరిమితమైన వారి వద్దకు వెళ్లి వైద్యసేవలందించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ అంజలి, బి.దివ్య, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజుపాలెం: మండలంలోని పెదనెమలిపురి పరిధిలోని శ్రీనివాసనగర్‌లో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య పరీక్షలు అందించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి వి.రవితేజనాయక్ 69 మందికి వైద్య పరీక్షలు చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

సత్తెనపల్లి: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన సత్తెనపల్లి మండలం దీపాలదిన్నెపాలెం సమీపంలో గురువారం అర్ధరాత్రి జరిగింది. దీపాలదిన్నెపాలెం గ్రామానికి చెందిన ఎం.డ్యానీ (30) ద్విచక్ర వాహనంపై ఫణిదం వెళ్తుండగా అదుపుతప్పి కింద పడిపోవడంతో మృతి చెందాడు. మృతునికి భార్యా, ఇద్దరు పిల్లలున్నారు. సంఘటన స్థలాన్ని సత్తెనపల్లి రూరల్ పోలీసులు సందర్శించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడి సోదరుడు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిబంధనల ప్రకారం నష్టపరిహారం చెల్లింపు: జేసీ



రైతులకు సబ్సిడీపై కంది విత్తనాలు అందిస్తున్న జేసీ

రాజుపాలెం: కొండమోడు–పేరేచర్ల జాతీయ రహదారి వల్ల భూములు కోల్పోయిన రైతులకు, ఇళ్ల స్థలాలు కోల్పోయిన లబ్ధిదారులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నష్ట పరిహారం చెల్లిస్తామని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్ తెలిపారు. తహసీల్దారు కార్యాలయ ఆవరణలో భూములు, స్థలాలు కోల్పోయే రైతులు, లబ్ధిదారులతో ఆయన శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలవ్యాప్తంగా 214 మంది భూములు, స్థలాలు కోల్పోతున్నారన్నారు. భూములు కోల్పోయే రైతులకు ఎకరాకు ప్రభుత్వం నిర్ణయించిన రేటుకు రెండు రెట్లు, పంచాయతీ అప్రూవల్, కన్వర్షన్ స్థలాలకు ఎకరాకు రూ. 32లక్షలు ఇస్తామని తెలిపారు. అనంతరం గణపవరం రైతు భరోసాకేంద్రంలో రైతులకు కంది విత్తనాలను జేసీ పంపిణీ చేశారు.

బంగారు వర్తక సంఘ మాజీ అధ్యక్షుడు జగన్‌మోహనరావు మృతి



సత్తెనపల్లి: పట్టణానికి చెందిన బంగారు వర్తక వ్యాపార సంఘ మాజీ అధ్యక్షుడు, లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు ఇమ్మడిశెట్టి జగన్‌మోహనరావు(58) గుండెపోటుతో శుక్రవారం మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. జగన్‌మోహనరావు భౌతికకాయాన్ని మంత్రి అంబటి రాంబాబు సందర్శించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నైపుణ్యాలను పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ డాక్టర్ మల్లయ్య

నరసరావుపేట ఈస్ట్: విద్యార్థులు సాధారణ డిగ్రీతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సోము మల్లయ్య తెలిపారు. కళాశాల గణితశాస్త్ర విభాగం, ఐక్యూఏసీ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ సైన్స్ సిటీ సహకారంతో శుక్రవారం కళాశాలలో ఆర్–ప్రోగ్రామింగ్‌పై ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. వివిధ కళాశాలల నుంచి దాదాపు 157 మంది విద్యార్థులు వర్క్‌షాప్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ మల్లయ్య మాట్లాడుతూ, కేవలం డిగ్రీతో ఉపాధి, ఉద్యోగావకాశాలు రావటం లేదని ప్రతి విద్యార్థి నైపుణ్యాలను పెంపొందించుకున్నప్పుడే జీవితంలో ఎదగగలరని తెలిపారు. కాగా, సైన్స్ సిటీ సీఈఓ డాక్టర్ కె.జయరామి రెడ్డి వర్చువల్‌లో విద్యార్థులతో మాట్లాడి ఆర్–ప్రోగ్రామింగ్ ప్రాధాన్యతను వివరించారు. ఆరు దశలుగా కొనసాగిన వర్క్‌షాప్‌కు కె.ఎల్.విశ్వవిద్యాలయం గణాంక శాస్త్ర ప్రొఫెసర్ కె.రాజ్యలక్ష్మి రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీనివాస సాయి, గణితశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎం.రమేష్, ఇంటర్మీడియేట్ ఇన్‌చార్జ్ డాక్టర్ ఎం.ఎస్.సుదీర్ తదితరులు పాల్గొన్నారు.

వినుకొండలో పట్టపగలు చోరీ



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని కొండమెట్ల బజారులో పట్టపగలు ఓ ఇంట్లో చోరీ జరిగింది. పట్టణానికి చెందిన ఎస్‌కే సుభాని కుటుంబ సభ్యులు వ్యక్తిగత పనులపై బజారుకు వెళ్లగా ..మేడపై నుంచి ఇంట్లోకి ప్రవేశించిన దొంగలు బీరువా తలుపులు పగలగొట్టి సుమారు రూ.3 లక్షల విలువ చేసే ఆభరణాలను దోచుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాపాడిన కారు బెలూన్లు!



యడ్లపాడు: రోడ్డు ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది. సకాలంలో కారులోని బెలూన్లు ఒక్కసారిగా ఓపెన్ కావడంతో కారులోని వ్యక్తి ప్రాణాలు నిలిచిన సంఘటన యడ్లపాడు మండలంలో బోయపాలెంలో శుక్రవారం జరిగింది. హైవే భద్రత అధికారులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ప్రకాశం జిల్లా దర్శికి చెందిన షేక్ షరీఫ్ శుక్రవారం వ్యక్తిగత పనిపై కారులో విజయవాడకు బయలు దేరాడు. మండలంలోని బోయపాలెం 16వ జాతీయ రహదారి హైవే వంతెనపైకి రాగానే ముందు వెళుతున్న పాల ట్యాంకర్‌ను కారు ఢీకొంది. ప్రమాదంలో షరీఫ్ ప్రయాణిస్తున్న కారు ముందుగా భాగం పూర్తిగా ధ్వంసమైంది. వెంటనే కారులోని బెలూన్లు ఓపెన్ కావడంతో షరీఫ్‌కు ప్రాణాపాయం తప్పి చెయ్యి విరిగింది. గాయాలైన షరీఫ్‌ను గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నిద్రమత్తు కారణంగా ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు.